
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 36.0 । కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

5



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

సోమవారం 11 మార్చి 2024

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కోడేరు, మార్చి 10: నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలోని ఊరగుట్టకు చెందిన బుజమోని వెంకటస్వామి(45) ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటస్వామి నిత్యం మద్యం తాగేవాడు. రెండు రోజుల కిందట భార్య సాయిలీలను కొట్టడంతో తల్లిగారి ఇంటికి వెళ్లింది. దాంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

విద్యుత్ వినియోగం
పెరుగుతోంది

- వేసవి నేపథ్యంలో ఇళ్లు, పరిశ్రమల్లో ఎక్కువగా వాడకం
- అధిక వినియోగం నమోదయ్యే ప్రాంతాల్లో విద్యుత్ శాఖ ప్రత్యేక కార్యాచరణ
- సరఫరాకు అంతరాయం కలుగకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు





మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం

పాలమూరు, మార్చి 10: ఎండాకాలం మొదలు కావడంతో మహబూబ్‌నగర్ జిల్లాలో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఈ నెల ఆరో తేదీన 7.34 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. జిల్లాలో ఈస్థాయిలో విద్యుత్ వినియోగం నమోదవటం ఇదే మొదటి సారి. ఈ ఏడాది జనవరి మొత్తం 31 రోజులకు 197.2 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా.. ఫిబ్రవరిలో 29 రోజులకే 197.28 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. ఇది జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని తెలుపుతోంది. అయినప్పటికీ విద్యుత్ సంస్థలు జిల్లాలో ఎక్కడా కోతలు లేకుండా కరెంటును సరఫరా చేస్తున్నాయి. నిమిషం కూడా కోతలు విధించినా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతోంది. మరో రెండు మూడు నెలలు విద్యుత్‌కు అధిక డిమాండ్ ఉండనుండటంతో అధికారులు ఆ మేరకు చర్యలు చేపడుతున్నారు.

తగ్గిన వరి సాగు

జిల్లాలో ఇప్పటికే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఇళ్లు, పరిశ్రమల్లో వాడకం పెరిగింది. దాంతో పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల అధిక వినియోగం అవుతోంది. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం.. 2022-23 యాసంగిలో జిల్లా వరి సాధారణ సాగు 57,201 ఎకరాలు కాగా.. 1,46,906 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 2023-24 యాసంగిలో వరి సాధారణ సాగు 79,465 ఎకరాలు కాగా.. 1,09,000 ఎకరాల్లో నాటారు. గతేడాదికంటే 36 వేల ఎకరాల్లో సాగు తగ్గింది. ఈ నేపథ్యంలో ఈ ఒక్క యాసంగిలో విద్యుత్ వాడకం తగ్గింది. మిగతా కేటగిరీల్లో వినియోగం పెరిగింది. దాంతో వేసవి కాలాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్‌ను అందించటానికి జిల్లా విద్యుత్‌శాఖ అధికారి పి.వెంకటరమేష్ క్షేత్రస్థాయిలో అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 220 కేవీ, 132 కేవీ, 33/11 కేవీ సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది. అదనపు భారాన్ని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు విద్యుత్ పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయిలను పెంచేందుకు అధికారులు సిద్ధమయ్యారు.



మరో వెయ్యి మెగావాట్లకు సిద్ధం

మహబూబ్‌నగర్ జిల్లాలో 220 కేవీ సబ్ స్టేషన్ ఒకటి, 132 కేవీ సబ్ స్టేషన్లు ఐదు, 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 83 ఉన్నాయి. మరో వెయ్యి మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌నైనా తట్టుకునేందుకు విద్యుత్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటి వరకు తెల్లరేషన్ కార్డులు కలిగి ఉండి, ఆధార్ అప్‌డేట్ చేసుకున్న 98 వేల విద్యుత్ కనెక్షన్లు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు అర్హత సాధించాయి. జిల్లాలో ఈ ఏడాది మార్చి ఒకటో తేదీ నాటికి 3,46,050 కనెక్షన్లు తొమ్మిది కేటగిరీల్లో కనెక్షన్లు కలిగి ఉన్నాయి.

- పి.వెంకట రమేష్, ఎస్ఈ, మహబూబ్‌నగర్

పెరుగుతున్న వినియోగం

మహబూబ్‌నగర్ జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. 2023 ఫిబ్రవరి 25వ తేదీన అధికంగా 9.61 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా.. అదే నెలలో తొమ్మిదో తేదీన అతి తక్కువగా 6.39 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అయ్యింది. తర్వాత అదే ఏడాది మార్చి 31న అధికంగా 9.97 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా.. మార్చి 17న అతి అతక్కువగా 4.94 మిలియన్ యూనిట్ల విద్యుత్, ఏప్రిల్ ఒకటిన అధికంగా 9.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడుకోగా, ఆ నెల 29న అత్యల్పంగా 4.08 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. ఈ ఏడాది విషయానికి వస్తే.. జనవరి 21వ తేదీన అత్యధికంగా 6.65 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా, ఈ నెల ఒకటో తేదీన అత్యల్పంగా 5.66 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. ఫిబ్రవరి 26వ తేదీన అధికంగా 7.16 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వాడుకోగా.. ఆ నెల నాల్గో తేదీన అతి తక్కువగా 6.32 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అయ్యింది. ఈ ఏడాది జనవరి 31 రోజులకు కలిపి 197.2 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వాడుకోగా.. గత ఫిబ్రవరి 29 రోజులకే 197.28 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వాడుకున్నారు. ఈ నేపథ్యంలో అధికంగా విద్యుత్ వినియోగించే ప్రాంతాలలో ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నారు. అందులో భాగంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి కోతలు విధించొద్దని, విధిస్తే చర్యలు తప్పవని జిల్లా అధికారులు హెచ్చరిస్తున్నారు.



కరెంటు బిల్లు ఇచ్చే మిషన్

ఫ్రేమ్ మగ్గాల ఊసేది?

- చేనేత కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన గత ప్రభుత్వం
- అసెంబ్లీ ఎన్నికలు రావడంతో మూలన పడ్డ ప్రతిపాదన
- గుంత మగ్గాలతో అనారోగ్యం పాలవుతున్న కార్మికులు



గుంత మగ్గంలో పట్టు చీరలు నేస్తున్న కార్మికులు

రాజోలి, మార్చి 10: గుంత మగ్గాలతో చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి కల్పించేందుకు గత ప్రభుత్వం ఇవ్వాలనుకున్న ఫ్రేమ్ మగ్గాల పంపిణీ అటకెక్కింది. గుంత మగ్గంతో పట్టు చీరలు తయారు చేస్తూ, చేనేత కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారు. పొద్దస్తమానం నిల్చొని పని చేసినా కూలీ గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. రోజుకు 10 గంటల పాటు నిల్చొని మగ్గం నేయాల్సి రావడంతో కార్మికులు కీళ్ల నొప్పుల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో మగ్గం గుంతలో నీళ్లు నిలిచి, మగ్గం తడవడంతో రోజుల తరబడి పనులు నిలిచిపోతున్నాయి. అగ్గిపెట్టెలాంటి చిన్న ఇండ్లు, కొట్టాలలో నివాసం ఉంటున్న కుటుంబాల్లో వర్షపు నీరు ఇంట్లోకి వచ్చి, పట్టు వస్త్రాలకు ఉపయోగించే ముడి సరుకులు తడిచి నష్టాలకు గురవుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కార్మికులకు కూర్చుని మగ్గం నేసేందుకు కొత్తగా ఫ్రేమ్ మగ్గాలు వచ్చాయి. వీటికి ఒక్కో దానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతోంది. అంత ఖర్చు భరించలేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.



రాజోలిలో ఓ చేనేత కార్మికుడు సొంతంగా ఏర్పాటు చేసుకున్న ఫ్రేమ్ మగ్గం

దరఖాస్తులు తీసుకుని మరిచిపోయారు

జోగుళాంబ గద్వాల జిల్లాలో 6,948 మంది చేనేత కార్మికులు ఉన్నారు. వారిలో 2,695 మంది జియోట్యాగింగ్ కలిగిన కార్మికులు ఉన్నారు. వారికి ఎక్కువగా గుంత మగ్గాలు ఉన్నాయి. జిల్లాలోని రాజోలి గ్రామంలో చేనేత కార్మికులు అధికంగా ఉన్నారు. 2009లో వచ్చిన వరదల్లో గ్రామం ముంపునకు గురవడంతో ప్రభుత్వం కొత్త రాజోలిలో నల్లరేగడి భూముల్లో పిట్టగూళ్లలా ఇళ్లను నిర్మించింది. వర్షం కురిస్తే అక్కడా గుంతల్లో నీళ్లు నిలిచి, నేత పని ఆగుతోంది. దాంతో కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారు. కార్మికులను అనారోగ్యం నుంచి కాపాడేందుకు, వారి సమస్యల పరిష్కారం సబ్సిడీపై ఫ్రేమ్ మగ్గాలను అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కార్మికుల నుంచి జిల్లా అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా రెండు వేల మందికిపైగా కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. ఫ్రేమ్ మగ్గాల ద్వారా పని వేగంగా జరగడంతో పాటు కూర్చొని పని చేసుకునే వీలుంటుంది. గతంలో చేనేత కార్మికుల నైపుణ్యం పెంచేందుకు ఆధునిక పరికరాల కోసం 90 శాతం వాటా ప్రభుత్వం భరిస్తే, 10 శాతం వాటా కార్మికులు చెల్లించేవారు. ఈ ఫ్రేమ్ మగ్గాలను కూడా అదేవిధంగా అందిస్తారని కార్మికులు ఎదురుచూశారు. వీటిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాత కార్మికులకు అందుబాటులోకి తేవాల్సి ఉంది. ఆ సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో.. ఆ తర్వాత నుంచి అధికారులు వాటి ఊసే ఎత్తడం లేదు. దీంతో కార్మికులకు ఫ్రేమ్ మగ్గాలు అందని ద్రాక్షగా మారాయి. ప్రభుత్వం స్పందించి ఇప్పించాలని కార్మికులు కోరుతున్నారు.

ఫ్రేమ్ మగ్గాలు అందించాలి



రాజోలి గ్రామంలో చాలా కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. వారికి గుంత మగ్గాలే దిక్కయ్యాయి. కార్మికులకు ఫ్రేమ్ మగ్గాలను అందిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. వాటికోసం చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం, అధికారులు స్పందించి ఫ్రేమ్ మగ్గాలను అందించాలి.

- మాదుగుండు రాజేష్, చేనేత కార్మికుడు, రాజోలి

ఆదేశాలు వస్తే పరిశీలిస్తాం



గత ప్రభుత్వం ఆదేశాల మేరకు చేనేత కార్మికుల నుంచి ఫ్రేమ్ మగ్గాల కోసం దరఖాస్తులు తీసుకున్నాం. జిల్లాలో రెండు వేల మందికిపైగా కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించాల్సిన సమయంలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే దరఖాస్తులను పరిశీలించి.. లబ్ధిదారుల నివేదికను ఉన్నతాధికారులకు పంపుతాం.

- ఏడీ గోవిందయ్య, చేనేత, జౌళీశాఖ ఏడీ, జోగుళాంబ గద్వాల

నామినేషన్ల దాఖలుకు
నేడు చివరి గడువు

- పత్రాలు సమర్పించనున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు జీవన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి
- ఓటర్ల మద్దతు కూడగట్టడంలో నాయకుల బిజీబిజీ



మన్నె జీవన్‌రెడ్డికి బీఫాం ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 10: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నామినేషన్ల ఘట్టం చివరి అంకానికి చేరడంతో పాలమూరు రాజకీయం వేడెక్కుతోంది. ఈనెల నాల్గో తేదీ నుంచి ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ సోమవారంతో ముగియనున్నది. ఇప్పటి వరకు ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు కాగా, చివరి రోజు కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి నామినేషన్లను ఉదయం 11 గంటలకు తమ పార్టీ మద్దతుదారులతో కలిసి దాఖలు చేయనున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి కేసీఆర్ నుంచి బీ ఫాం అందుకోగా, కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి ఆదివారం తన చిన్నాన్న, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ అధినేత మన్నె సత్యనారాయణరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి బీ ఫాం అందుకున్నారు. నామినేషన్లు ముగిసిన అనంతరం అసలు రాజకీయం మొదలవనుంది ఇప్పటికే ఆయా పార్టీలు కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల మద్దతుకోసం మంతనాలు సాగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ.. ఉమ్మడి పాలమూరులో గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలకు, మిగిలిన రెండు నియోజకవర్గాల ఇన్‌చార్జీలకు ఆయా నియోజకవర్గాలలో ఉన్న ఓటర్ల మద్దతు కూడగట్టే బాధ్యతలను అప్పగించగా, బీఆర్ఎస్ మాత్రం రెండు నియోజకవర్గ ఎమ్మెల్యేలతోపాటు 12 నియోజకవర్గాల్లోని మాజీ ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఏ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు ఆయా ప్రాంతాల్లోని ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేయనున్నారు. బీఆర్ఎస్ పార్టీ తమ పార్టీ నుంచి గెలుపొందిన స్థానిక ప్రజాప్రతినిధులు చేజారిపోకుండా వారితో నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. అధికార పార్టీ మాత్రం ఆయా నియోజకవర్గాల్లో ప్రజా ప్రతినిధులను వీలైతే పార్టీలో చేర్చుకోవడం, లేదంటే పరోక్షంగా మద్దతు కూడగట్టే ప్రయత్నం చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 1,437 మంది ఓటర్లు ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీలో 944 మంది ఉండగా, కాంగ్రెస్‌లో 379 మంది, బీజేపీలో 93 మంది ఉన్నారు. ఇతరులు 21 మంది ఉన్నారు. అయితే బీఆర్ఎస్‌వైపు మెజారిటీ సభ్యులు ఉన్నా.. చివరివరకు ఎంతమంది పార్టీ అభ్యర్థికి మద్దతుగా ఉంటారన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. చాలామంది అధికార పార్టీ వైపు మొగ్గుచూపుతున్నారన్న చర్చ సాగుతోంది. ఇన్నాళ్లు బీఆర్ఎస్ నుంచి వచ్చేవాళ్లను పార్టీలో చేర్చుకోబోమని చెబుతూ వచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు ఎంపీ ఎన్నికల్లో గెలువాలంటే ఆ పార్టీ సభ్యులను చేర్చుకోవడం అనివార్యంగా మారింది. ఇప్పుడు ఇదే బీఆర్ఎస్‌ను కలవరపాటుకు గురిచేస్తోంది. మెజారిటీ ఉన్నా.. వారిని కాపాడుకోవడం అంత ఈజీ కాదన్న అభిప్రాయం చాలామందిలో ఉంది. ఇప్పటికే పలుచోట్ల పార్టీ ఫిరాయింపులు మొదలవడం, అసంతృప్తులు దగ్గరవుతుండటంతో వారి మద్దతుతో గెలుపు కష్టమేమీ కాదన్న ధీమాలో అధికార పార్టీ ఉన్నా, మెజారిటీ సభ్యులు తమ పార్టీలో ఉన్నందున కొంతమంది చేజారినా మిగతా వారి మద్దతుతో గెలుస్తామని బీఆర్ఎస్ పార్టీ ఆశలు పెట్టుకుంది. ఈనెల 28న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్‌లు, విత్‌డ్రాలు ముగిసిన తరువాత క్యాంప్ రాజకీయం జోరందుకోనుంది.

రాంకొండకు పోటెత్తిన భక్తులు

మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండల కేంద్రంలోని రాంకొండకు అవామాస్య సందర్భంగా భక్తులు ఆదివారం పోటెత్తారు. కోయిలకొండ మండలంతో పాటు జిల్లా నుంచి భక్తులు తరలివచ్చారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా వేల సంఖ్యలో కిలో మీటరు మేర బారులు తీరారు. కొండపైకి ఎక్కి రాముడిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం అక్కడి గుండంలోని నీటిని భక్తులు ఇళ్లకు తీసుకెళ్లారు. వాటిని ఒంటిపై చల్లుకుంటే మంచిదని భావిస్తారు. తర్వాత అక్కడి ఏదైనా ఒక చెట్టు కొమ్మను కూడా ఇళ్లకు తీసుకెళ్లడం ఆచారంగా వస్తోంది. వేసవి నేపథ్యంలో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

- మహబూబ్‌నగర్



కొండపైన కొలువుదీరిన స్వామి వారు



రాముడి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అన్ని గ్యారెంటీలు అమలు చేస్తాం

- ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ సంపత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సంపత్ కుమార్

బిజినేపల్లి, మార్చి 10 : అన్ని గ్యారెంటీలు అమలు చేస్తామని ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సంపత్ కుమార్ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెం వెంకన్న స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేసి విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజల పక్షాన గొంతెత్తి పోరాటం చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో అధికారం కట్టబెట్టారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. అలాగే సోమవారం మరో రెండు గ్యారెంటీలను సీఎం అమలు ప్రకటన చేయబోతున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు స్థానం పరిధిలోని అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, అలంపూర్ నియోజక వర్గాల్లోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్లు, మాజీ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ వివిధ స్థాయిల్లోని నాయకులు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేసేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఎంపీ సీటుకు దరఖాస్తు చేసుకున్న 26 మందిలో ఎవ్వరికి టికెట్ ఇచ్చిన వారి గెలుపు కోసం చిత్తశుద్ధి పనిచేస్తామన్నారు.

అనంతరం కాంగ్రెస్ నాయకుడు చారకొండ వెంకటేష్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజక వర్గ అభ్యర్థిగా ఎవ్వరికి అవకాశం వచ్చినా కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు మిద్దె రాములు, అమృత్ రెడ్డి, మిద్దె మల్లేష్, వెంకటస్వామి, రామకృష్ణ, రాము, మిద్దె శ్రీశైలం, భగవంత్ గౌడ్, వాల్యానాయక్, తిరుపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ అంతరించిపోయే పార్టీ

- ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు
- 14 ఎంపీ సీట్లు గెలుస్తాం: మంత్రి జూపల్లి కృష్ణారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

వీపనగండ్ల, మార్చి 10: పార్లమెంటు ఎన్నికల తరువాత బీఆర్ఎస్ పార్టీ అంతరించిపోతుందని ఎక్సైజ్, పర్యాటక శాఖ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం తూముకుంటలో ఆదివారం గ్రామాల వారీగా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధనిక రాష్టాన్ని రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ పాలనలో అవినీతి, రాజరికం, అప్రజాస్వామికం, విద్యార్థులను మోసం చేయడం వంటి అరాచకాలు జరిగాయన్నారు. అవే బీఆర్ఎస్ అంతానికి కారణం అవుతున్నాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలు గెలుచుకుంటుందని, ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాలను కైవసం చేసుకుంటామని చెప్పారు. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీఆర్ఎస్ నుంచి వలసలు ప్రారంభమయ్యాయని, ఆ పార్టీ దుకాణం బంద్ అవుతుందని తెలిపారు. సింగోటం, గోపాల్ దిన్నె రిజర్వాయర్లను అనుసంధానం చేసి, వీపనగండ్ల, పాన్‌గల్, చిన్నంబావి మండలాల్లో సాగునీటి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఏడాదిలో ఈ కాలువను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నారాయణరెడ్డి, బాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేష్, మదన్మోహన్‌రావు, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పథకాలు ప్రతీ ఒక్కరికి అందాలి

సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికి అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తూముకుంటలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. సమావేశం దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల కంటే మరింత ఐక్యంగా పార్లమెంటు ఎన్నికల్లో గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్య, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ - ముగ్గురికి గాయాలు

జడ్చర్ల, మార్చి 10 : జడ్చర్ల కొత్తబస్టాండు సమీపంలో రెండు ఆర్టీసీ బస్సులు ఢీ కొన్నాయి. టీఎస్ఆర్టీసీ, ఏపీఎస్ఆర్టీసీ బస్సులు జడ్చర్ల కొత్త బస్టాండులోకి వస్తుండగా ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో బాలానగర్ మండల కేంద్రానికి చెందిన రవికుమార్, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. కాగా డ్రైవర్ కమ్ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తుండడమే ప్రమాదానికి కారణమని ప్రయాణికులు ఆరోపించారు.

ఉత్సవమూర్తులకు అశ్వవాహన సేవ



అశ్వవాహనంపై జోగుళాంబ సమేత బాలబ్రహ్మేశర ఉత్సవమూర్తులు

అలంపూర్, మార్చి 10: అలంపూర్ బాల బ్రహ్మేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం యాగశాలలో హోమాలు, బలిహరణం చేశారు. జోగుళాంబ సమేత బాల బ్రహ్మేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రావణ వాహన సేవలో పట్టణంలోని పురవీధుల గుండా ఉత్సవమూర్తులను ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణ నాయుడు, ఈవో పురేందర్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు వెంకటనారాయణ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. కాగా సాయంత్రం కర్నూలు పట్టణం ప్రముఖ దంత వైద్యుడు లక్కిరెడ్డి అమరసింహా రెడ్డి, సోదరుడు కరుణసింహా రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు సమయంలో అమ్మవారు, బాల బ్రహ్మేశ్వర స్వామి ఉత్సవ సేవలకు అశ్వ వాహనాన్ని బహూకరించారు. ఇదే వాహనంలో స్వామివార్ల సేవ, పారువేటను దాతల సమక్షంలో నిర్వహించారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

ఎర్రవల్లి, మార్చి 10: బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ దిమ్మెకు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గద్వాల జిల్లా ఎర్రవల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకున్నది. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం జానంపేట గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై ఎర్రవల్లి వైపు వస్తుండగా విజయ ఆయిల్ మిల్లు సమీపంలో సిమెంట్ దిమ్మెను ఢీకొన్నారు. దాంతో మహేష్ (22) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు యువకులు వీరేష్, బాలుకు తీవ్ర గాయాల పాలైనట్లు ఎస్ఐ తెలిపారు. క్షతగాత్రులను గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కోడేరు, మార్చి 10 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల పరిధిలోని తుర్కదిన్నె గ్రామంలోని చెక్‌డ్యామ్‌లో చేపల వేటకు వెళ్లిన రాముడు (28) విద్యుదాఘాతానికి గురై ఆదివారం మృతి చెందాడు. స్థానికులు గమనించి మృతుని కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారమివ్వగా ఎస్ఐ కురుమూర్తి సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మత్స్యకారులకు చిక్కిన 30 కేజీల చేప



మత్స్యకారులకు చిక్కిన భారీ చేప

మక్తల్, మార్చి 10 : మత్స్యకారులకు 30 కేజీల చేప చిక్కింది. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం పస్పుల గ్రామ సమీపంలో కృష్ణానదిలో మత్స్యకారులకు ఆదివారం భారీ చేప చిక్కింది. ఈ చేప బరువు 30 కేజీలు ఉన్నట్లు మత్స్యకారుడు అశోక్, మల్లేష్, పరుశరాములు, ఆనంద్ తెలిపారు. కృష్ణానదిలో నీటి మట్టం తగ్గడంతో మరిన్ని చేపలు లభించే అవకాశం ఉందంటున్నారు. భారీ చేపను చూసేందుకు పలువురు ఆసక్తి కనబర్చారు.

కల్లు సీసాలో చనిపోయిన పాము

- అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

భూత్పూర్, మార్చి 10 : కల్లు తాగుతుండగా సీసాలో చనిపోయిన పాము కనపడడంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన మహిళ అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైంది. ఈ సంఘటన ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మునిసిపాలిటీలోని అమిస్తాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మహిళ కూలీ పనులు చేసుకొని గ్రామంలో ఉన్న కల్లు దుకాణాకి వెళ్లి కల్లు తాగుతుండగా సీసాలో చనిపోయిన పాము కనిపించడంతో షాకు గురై అక్కకక్కడే అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు మహిళను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై మాట్లాడేందుకు ఎక్సైజ్ శాఖ ఎస్ఐ శ్రుతిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

పామాయిల్ చెట్లు దగ్ధం

పెంట్లవెల్లి, మార్చి 10 : ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్‌సర్క్యూట్‌తో పామాయిల్ చెట్లకు నిప్పు అంటుకుని కాలిపోయిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల పరిధిలోని కొండూరు గ్రామ సమీపంలో గల మొగిలిపురంలో చోటు చేసుకుంది. పంట చేతికొచ్చిన సమయంలో కాలిపోవడంతో దాదాపుగా రూ. ఐదు లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి పూర్తిగా నష్టపోయాయని రైతు శంకర్‌రావు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



సాంబశివుడు (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 10 : గుర్తు తెలియని వాహనం ఢీకొని మాండ్ల సాంబశివుడు(30) అనే యువకుడు మృతి చెందినట్లు మృతుని బంధువులు ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం ఎత్తం గ్రామానికి చెందిన సాంబశివుడు నాగర్‌కర్నూల్ వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో నాగర్‌కర్నూల్ మండలంలోని వనపట్ల గేటు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తలకు గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. ఈ ఘటన చూసిన స్థానికులు 108కు సమాచారమందించి నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి గత ఆరు నెలల క్రితం కొల్లాపూర్‌కు చెందిన దీపికతో వివాహమైంది. సాంబశివుడు మృతి చెందడంతో మృతుని బంధువులంతా జిల్లా ఆసుపత్రి దగ్గర రోదనలు మిన్నంటాయి. ఈ సంఘటనపై స్థానిక పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ప్రమాదంలో యువకుడు మృతి చెందగా ఈ సంఘటనపై మృతుని బంధువులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

ప్రపంచ శాంతికాముకుడు ఏసుప్రభు

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి
- ఎంబీ ఒలీవ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

వనపర్తిటౌన్, మార్చి 10: ప్రపంచ మానవాళి శాంతితో జీవించాలని తన రక్తాన్ని చిందించిన ఏసుప్రభు లోక రక్షకుడని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంబీ ఒలీవ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. సంఘం సభ్యులు చిన్నారెడ్డిని పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై ఏసుప్రభువు దీవెనలు ఉండాలని, ఆ విధంగా ప్రార్థనలు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే అన్ని మతాలను, కులాలను సమానంగా చూస్తుందని, క్రైస్తవ మతం అంటే శాంతికి, స్నేహపూర్వతకు మారుపేరన్నారు. క్రైస్తవులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా తోడుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, బీ కృష్ణ, ఖమ్మర్ మియా, పరశురాం, రాగి వేణు, దివాకర్, రోహిత్, సేవాదళ్ జానకిరాములు, జయమ్మ, చర్చి పాస్టర్ జానప్ప, చైర్మన్ పీడీ సుమిత్ర, కార్యదర్శి ఎంఎస్ రోనాల్డ్, చర్చి సభ్యులు పీడీ కళానందం, ఏజే విద్యాసాగర్, మహిళ కమిటీ చైర్మన్ కే సరోజమ్మ, మాజీ కౌన్సిలర్ పీడీ కమలమ్మ, ప్రేమిల, ఎల్లద్దాయి, జానీ, ఎర్నెస్ట్, పీడీ జయనందం, పీజే మోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

పేదలు అభివృద్ధి చెందాలి

పెద్దమందడి: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పేదలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జంగమయ్యపల్లిలో కొమ్ముల గట్టు వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకు మరింత శక్తిని ఇవ్వాలని, రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలని వేంకటేశ్వరస్వామిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఏఐసీసీ స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్యరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంటన్న, నాయకులు సత్యారెడ్డి, ఉమామహేశ్వరి, సుభాష్‌గౌడ్, బాలరాజ్, గంజాయి రమేష్, కదిరే రాములు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



చిన్నారెడ్డిని సన్మానించి ప్రార్థిస్తున్న ఒలీవ చర్చి పాస్టర్, క్రైస్తవ సంఘం సభ్యులు

చిన్నారెడ్డికి సన్మానం

కొత్తకోట : ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ చిన్నారెడ్డిని కొత్తకోట కాంగ్రెస్ నాయకులు ఆదివారం కలిసి సన్మానించారు. వనపర్తి నుంచి హైదరాబాద్ వెళ్తున్న చిన్నారెడ్డిని సంకిరెడ్డిపల్లి గ్రామ శివారులోని గంపుగట్టు సమీపంలో కలుసుకున్నారు. సన్మానం చేసిన వారిలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పీజే. బాబు, నాయకులు సాయులు యాదవ్, గోకరయ్య, కురుమూర్తి, దేవదానం ఉన్నారు.

పునరావాస గ్రామాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

- పీసీసీఎఫ్ రాకేష్ మోహన్ దోబ్రియాల్

దోమలపెంట, మార్చి 10: నల్లమల ప్రాంతంలోని సార్లపల్లి, కుడిచింతలబైలు గ్రామాల ప్రజలకు త్వరితగతిన పునరావాస ప్యాకేజీ అమలయ్యేగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అటవీశాఖ ముఖ్యసంరక్షణ అధికారి (పీసీసీఎఫ్) రాకేష్ మోహన్ దోబ్రియాల్ ఆదేశించారు. అమ్రాబాద్ పులుల అభయారణ్య పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన దోమలపెంట రేంజ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వనమయూరి అతిథి గృహంలో అమ్రాబాద్ పులుల అభయారణ్య అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. వేసవిలో అడవిలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుండా జాగ్రత్త వహించాలన్నారు. అడవిలో వన్యప్రాణులను వేటాడటం, కలపను స్మగ్లింగ్ చేసుకుపోవడం వంటి చర్యలను అడ్డుకట్టవేసేందుకు అధికారులు గట్టి నిఘా పెట్టాలన్నారు. వేసవిలో వన్య ప్రాణుల తాగునీటి వనరులను పెంచాలని, సౌరశక్తి మోటార్లను సద్వినియోగం చేసుకొని తాగునీటి సరఫ రాకు చర్యలు చేపట్టాలన్నారు. అడవులను వీడి మైదాన ప్రాంతాల్లోకి వెళ్లేందుకు సార్లపల్లి, కుడిచింతలబైలు గ్రామాల ప్రజలు ఒక నిర్ణయానికి రావడం శుభపరిణామమన్నారు. ఇట్టి కుటుంబాలకు పెద్దకొత్తపల్లి మండలం బాచారం సామాజిక అడవుల్లో అన్ని రకాల వసతులతో కూడిన గృహనిర్మాణాలను పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతం క్షేత్ర సంచాలకులు(ఎఫ్‌డీ) క్షితిజ, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీఓ శ్రీనివాసులు, రేంజ్ అధికారులు ఆదిత్య, ఈశ్వర్, గురుప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాకేష్ మోహన్ దోబ్రియాల్

పర్వతాపూర్ మైసమ్మను దర్శించుకున్న డీఐజీ

నవాబ్‌పేట, మార్చి 10 : మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారిని ఆదివారం ఉదయం జోగుళాంబ గద్వాల డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ దర్శించుకున్నారు. మొక్కులో భాగంగా అమ్మవారి ఆలయం ముందు 50 గుమ్మడి కాయలు కొట్టారు. ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి డీఐజీకి స్వాగతం పలికి సంప్రదాయ బద్ధంగా ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి తిరిగి వెళ్లారు. ఆదివారం అమావాస్య సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి మైసమ్మ ఆలయానికి భక్తులు భారీగా తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేసినట్లు ఈవో తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఉప్పునుంతల, మార్చి 10 : మండల పరిధిలోని జప్తి సదగోడు గ్రామానికి చెందిన ఆకునోని వెంకటయ్య, అదే విధంగా తిరుల్మాపూర్ గ్రామానికి చెందిన వంగూర్ సాయికుమార్‌కు చెందిన రెండు ట్రాక్టర్లు దుందుభీ వాగు నుంచి ఆదివారం ఉదయం అక్రమంగా ఇసుకను తిర్మలాపూర్ వైపు తరలిస్తున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కె, రవితో పాటు హోంగార్డు లక్ష్మణ్ ట్రాక్టర్లు పట్టుకొని పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్లు స్టేషన్‌కు తరలించారు. ఎస్సై లెనిన్ ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రీడలు జీవనశైలిలో అంతర్భాగం

- పీయూ వైస్ చాన్స్‌లర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్‌రాథోడ్



సెమినార్‌లో మాట్లాడుతున్న వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 10 : క్రీడలు మానవ జీవనశైలిలో అంతర్భాగమని పీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్‌రాథోడ్ అన్నారు. ఆదివారం యూనివర్సిటీలోని లైబ్రరీ ఆడిటోరియంలో జరిగిన ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ ఫిట్‌నెస్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్-2024, ఇటీవల పోకడలు అనే అంశంపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. సమగ్ర వి ద్యాభివృద్ధిలో భాగంగా యూనివర్సిటీలో ఆటలు, క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వర్క్‌షాప్‌లో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ముఖ్యవక్తలు, అధికారులు పాల్గొన్నారు.

బీసీలను విస్మరిస్తే మూల్యం చెల్లించుకుంటారు

- బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు



జనగర్జనలో మాట్లాడుతున్న సంగెం సూర్యారావు

పాలమూరు, మార్చి 10 : మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీసీలు 65శాతం ఉన్నారని, తమను విస్మరిస్తే మూల్యం చెల్లించుకుంటారని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు అన్నారు. బీసీ వర్గాల వారికి ఎంపీ టికెట్లు ఇవ్వాలని కోరుతున్నా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఇప్పటికే అగ్రవర్ణాల వారికే టికెట్ కేటాయించారని పేర్కొన్నారు. మిగిలిన బీజేపీ అయినా బీసీ అభ్యర్థికి సీటు ఇచ్చి తన నిజాయితీని నిరూపించుకోవాలని కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్‌హాలులో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ అధ్యక్షత వహించిన బీసీ జన గర్జన మహాసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గర్జనలో ఆయన మాట్లాడుతూ బీసీలే రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలన్నారు. అధికారం అగ్రవర్ణాల చేతిలో ఉండటంతో బీసీల సమస్యలు పరిష్కరించమని అడుక్కోవాల్సిన పరిస్థితి ఉందని, బీసీల రాజ్యం వస్తేనే బీసీల జీవితాలు బాగుపడతాయన్నారు. పాలించే స్థానంలో బీసీలు ఉండటంతోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. బీసీలను అభ్యర్థులుగా నిలబెట్టకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు యం.శ్రీనివాస్ నిప్పులు చెరిగారు. సమావేశంలో కో-కన్వీనర్ సవారి సత్యం, బి.శేఖర్, మహిళా కన్వీనర్ శివాని, శ్యాంసుందర్, ప్రణీల్ చందర్, మహేందర్, బుగ్గన్న, రాజేష్, వెంకట నరసయ్య, వకీల్ భీమయ్య, నడిమింటి శ్రీనివాసులు, రోమియో రమేష్, రమేష్, అనంతరాములు, బాలవర్ధన్‌గౌడ్, చిన్నకిష్టయ్యసాగర్, కోట్ల కిషోర్, డి.కె.నాయి, లక్ష్మీకాంత్‌సారంగి పాల్గొన్నారు.

మద్దతు ఇవ్వండి

- బీజేపీ నాయకులను కలిసిన ఎంపీ పోతుగంటి రాములు



ఉమ్మడి పాలమూరు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు యాదగిరిరెడ్డిని కలిసిన ఎంపీ రాములు తన తనయుడు భరత్ ప్రసాద్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మార్చి 10 : నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఎంపీ పోతుగంటి రాములు, హైదరాబాద్‌లో బీజేపీ నాయకుడు యాదగిరిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల తన కుమారుడు పోతుగంటి భరత్‌తో కలిసి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన కుమారుడు భరత్‌ను బీజేపీ అధిష్టానం నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి అభ్యర్థిగా ప్రకటించినందున బీజేపీ ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ అధ్యక్షుడైన యాదగిరిరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రాములు కలిశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలో మద్దతునివ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. యాదగిరిరెడ్డి మాట్లాడుతూ బీజేపీ క్రమశిక్షణ గల పార్టీ అని, ఈ పార్టీలో చేరినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. రాములు, తనయుడు పార్టీలోకి రావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ మరింత పటిష్టమై అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ రాములుతో పాటు అశోక్‌రెడ్డి, మల్లికార్జున్, నరేష్ ఉన్నారు.

గద్వాలలో చైన్ స్నాచింగ్

- వృద్ధురాలి నుంచి ఐదు తులాల గొలుసును లాక్కెళ్లిన దొంగలు

గద్వాల క్రైం, మార్చి 10 : దేవాలయానికి వెళ్తున్న ఓ వృద్ధురాలి మెడలో ఉన్న ఐదు తులాల బంగారు గొలుసును చైన్ స్నాచర్లు లాక్కెళ్లిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని భీంనగర్ కాలనీలో ఉన్న శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో ఉన్న జయలక్ష్మి అనే వృద్ధురాలు ఆదివారం ఉదయం సమీపంలో ఉన్న రాఘవేంద్రస్వామి దేవాలయానికి నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చారు. ఓ వ్యక్తి వృద్ధురాలి వెంట కొంతదూరం నడిచి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కెలి మోటర్‌బైక్‌పై ఎక్కి ఇద్దరు పరారయ్యారు. వృద్ధురాలు లబోదిబోమంటూ విషయాన్ని కుటుంబ సభ్యుల కు తెలుపగా పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆ కాలనీలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో దాడి.. మృతి చెందిన భార్య



కృష్ణవేణి

చాదర్‌ఘాట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యాభర్తలు గొడవ పడ్డారు. ఉద్రేకానికి లోనైన భర్త పారతో భార్య తలపై కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన మలక్‌పేటలో ఆదివారం జరిగింది. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా మాచన్నపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్, కృష్ణవేణి(35) దంపతులు ముసారాంబాగ్ శాలివాహననగర్ కాలనీలోని నారాయణి గోశాలలో నివాసముంటున్నారు. వెంకటేశ్ కూలీ పనిచేస్తుండగా.. కృష్ణవేణి గోశాలలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. శనివారం రాత్రి మద్యం తాగి వచ్చిన వెంకటేశ్ భార్య కృష్ణవేణితో గొడవ పడ్డాడు. ఆ తర్వాత కృష్ణవేణి నిద్రించగా వెంకటేశ్ పారతో ఆమె తలపై కొట్టాడు. తీవ్రంగాగా యపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందడంతో వెంకటేశ్ పరారయ్యాడు. ఆదివారం విషయం తెలుసుకున్న మలక్‌పేట పోలీసులు కృష్ణవేణి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్టాండులో తెరచుకోని దుకాణాల షెట్టర్లు

- టెండర్లు ఖరారైనా వ్యాపారుల వెనుకంజ
- ఆర్టీసీ ఆదాయానికి గండి

గద్వాల అర్బన్, మార్చి 10 : పెరిగిన ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా 15 ప్లాట్‌ఫాంలతో కొత్తగా నిర్మించిన గద్వాల ఆర్టీసీ బస్టాండ్‌లో వివిధ వ్యాపారుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన దుకాణాలు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడం ప్రయాణీకులకు అసౌకర్యాంగా మారింది. బస్టాండ్ ప్రారంభమై నాలుగు నెలలు దాటుతున్నా ఉన్న మొత్తం 16 దుకాణాల్లో ఒక్కచోట మాత్రమే వ్యాపారం నిర్వహిస్తుండగా మిగతావన్నీ మూత పడిన షెట్టర్లతో అలంకార ప్రాయంగా మారాయి. ఆర్టీసీ నిబంధనల మేరకు ఉన్నతాధికారుల అనుమతితో 15 దుకాణాలకుగాను మూడు దుకాణాలను యాజమాన్యం అవసరాల కోసం మినహాయించి మిగతా 13 దుకాణాలకు రెండు నెలలల క్రితమే వేలం నిర్వహించారు. వేలంలో పాల్గొని దుకాణాలు దక్కించుకున్న వ్యాపారుల్లో ఒక్కరు తప్ప మిగతా 12 మంది ఇప్పటి వరకు తమ వ్యాపారాలను ప్రారంభించకపోవడం గమనార్హం. దీంతో ఏ చిన్న వస్తువు కొనాలన్నా ప్రయాణీకులు బస్టాండు బయట రోడ్డుపైకి వెళ్లాల్సిందే. ఈ క్రమంలో కొన్న సందర్భాల్లో బస్సులు తప్పిపోయిన ఘటనలు ఉన్నాయంటూ ప్రయాణీకులు వాపోతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



బస్టాండ్ దుకాణాల వేలం అంశం రీజనల్ మేనేజర్ పరిధిలోనే ఉంటుంది. ఇక్కడి సమస్యలను ఆర్ఎం దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లాం. వారు తీసుకునే నిర్ణయం, ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటాం. త్వరలోనే దుకాణాలకు మరోసారి వేలం నిర్వహించి అన్ని వ్యాపారాలు సాగేలా చర్యలు తీసుకుంటాం.

- ఆర్. మంజుల, డిపో మేనేజర్, గద్వాల

● అద్దె భారంతోనే....

ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణాల అద్దె అధికంగా ఉండటం వల్లే వ్యాపారులు దుకాణాలు తెరిచేందుకు ముందు రావడటం లేదన్నది సర్వత్రా వినిపిస్తున్న మాట. పట్టణంలోని ప్రధాన రోడ్లపై మునిసిపల్ షాపులకు చెల్లించేంత స్థాయిలో దుకాణాల అద్దె ఉండటంతో వ్యాపారులు లాభనష్టాలపై బేరీజు వేసుకునే పనిలో పడ్డారు. బజారులో మునిసిపల్ దుకాణాల సైజుతో పోల్చితే బస్టాండులో దుకాణాల వైశ్యాలం తక్కువగా ఉన్నప్పటికీ అద్దెలు మాత్రం అధికస్థాయిలో ఉన్నాయంటూ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు బజారులో ఉండే దుకాణాలకు అన్నిరకాల వినియోగదారులు రావడం సహజం కాగా, బస్టాండ్‌లో ఉండే దుకాణాలకు ప్రయాణీకులు మాత్రమే రావాల్సి ఉండటంతో నిర్వహించే వ్యాపారాలు ఎంత మాత్రం లాభాలనిస్తాయన్నది అనుమానంగా మారింది.

దీంతో వేలంలో ఉత్సాహంగా పాల్గొని దుకాణాలు దక్కించుకున్న వారు అనంతరం తాపీగా వ్యాపార నిర్వహణపై లాభనష్టానలు బేరీజు వేసుకుంటూ దుకాణాలను ప్రారంభించేందుకు వెనుకంజ వేస్తున్నారు. దాంతో ఆర్టీసీ సంస్థకు నష్టం తప్పడం లేదు. బస్టాండ్‌లో నిర్వహించుకునే దుకాణాల్లో ఏ రెండింటిలోనూ ఒకేరకమైన వ్యాపారం నిర్వహించకూడదన్నది కనీస షరతుగా ఉండగా ప్రస్తుతం ఆ నిబంధన ఏదీ లేదు. దానితో కూడా వ్యాపారాల నిర్వహణపై వేలందారుల్లో అపనమ్మకం తొలగడం లేదు. ఇప్పటివరకు వేలంలో ఖారారైన దుకాణాల అద్దెను లెక్కిస్తే నెలకు గద్వాల డిపోకు రూ.1.50లక్షల మేరకు ఆదాయం రావాల్సి ఉండగా దుకాణాలు తెరవకపోవడంతో వచ్చే ఆదాయానికి గండి పడింది.



గద్వాల కొత్తబస్టాండ్‌లో తెరచుకోని దుకాణాలు

సమాచారం లేకుండా అధ్యక్షుడిని తొలగిస్తే ఎలా?

- బీజేపీ మండల ముఖ్య నాయకుల సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి

వెల్దండ, మార్చి 10 : తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మండల పార్టీ అధ్యక్షుడిని ఏకపక్షంగా తొలగించి మరో అధ్యక్షుడిని నియమించడం ఏమిటని మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తంచేశారు. కొత్త అధ్యక్షుని ఎన్నిక చెల్లదని, పాత అధ్యక్షుడినే కొనసాగించాలని వారు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆదివారం మండలకేంద్రంలోని ఆకృతిగార్డెన్‌లో బీజేపీ మండల స్థాయి బూత్‌లెవల్, పతాధికారుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తమకు తెలియకుండా నియోజకవర్గ ఇన్‌చార్జి ఏకపక్షంగా వ్యవహరించి అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి స్థానంలో కుర్మిద్ద యాదగిరిని మండల అధ్యక్షునిగా నియమించడం, తమ అభిప్రాయాలు తీసుకోకుండా పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిండం బాగోలేదని మండిపడ్డారు. పార్టీలో ఎటువంటి చర్చ జరగకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం పార్టీ ప్రతిష్టను దిగజార్చడమేనన్నారు. పార్టీలో కొందరు అతిగా వ్యవహరిస్తుండడంతో రోజురోజుకు గ్రూపులు పెరుగుతున్నాయని, రాబోవు పార్లమెంటు ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేస్తేనే పార్టీ విజయం సాధిస్తుందన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న విజేందర్‌రెడ్డినే అధ్యక్షునిగా కొనసాగించాలని ఈ సందర్భంగా తీర్మానించారు. సమావేశంలో అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు చిందం కృష్ణయ్య, నక్కెరకంటి శ్రీనివాసులు, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్యయాదవ్, సంతోష్, యాదయ్య, రామస్వామి, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, కృష్ణ ఉన్నారు.

వైభవంగా రథోత్సవం



పూలరథాన్ని తాడుతో లాగుతున్న భక్తులు

చారకొండ, మార్చి 10: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శివాలయం, దుర్గమాత దేవాలయంలో ఆదివారం తెల్లవారుజామున గ్రామస్థులు పూలరథోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ నారోజు పార్థసారధి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్త భజన బృందం సభ్యులు రథోత్సవాన్ని పూలమాలలతో అలంకరించి శివపార్వతుల చిత్రపటాన్ని పెట్టి బ్యాండు మేళాలు, బాజాభజంత్రీల నడుమ భక్తులు రథాన్ని దేవాలయం చుట్టూ తిప్పి ముందుకు లాగారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రానికి చెందిన బెజవాడ రమేష్‌గౌడ్ భక్తులకు అన్నదానం చేశారు.

● దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

మండల కేంద్రంలోని శివాలయం, దుర్గామాత దేవాలయంలో ఆదివారం డాక్టర్ మల్లురవి, జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లతో కలిసి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పార్వతీ పరమేశ్వరులు, దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్త భజన బృందం సభ్యులు రవిచారి, మట్ట వెంకటయ్యగౌడ్, ఆంజనేయులుగౌడ్, యాదయ్యగౌడ్, బాలచ్చిగౌడ్, జెల్ల రామస్వామిగౌడ్, అంజయ్యగౌడ్, బాల్‌నారాయణగౌడ్, జనార్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, పీఏసీఎస్ డైరక్టర్ జగన్‌మోహన్, కొండలయ్యగౌడ్, నర్సింహచారి, లక్ష్మయ్యగౌడ్, ఆలయ అర్చకులు కృష్ణశర్మ, అనిల్శర్మ, వేణుశర్మ, ప్రశాంత్‌శర్మ, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

'పథకాల అమలులో ఐదుశాతం కేటాయించాలి'

తిమ్మాజిపేట, మార్చి 10 : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయించాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలీశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న పథకాల్లో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయన్నారు. అధికారులు ఆర్థిక నిర్వహణ సక్రమంగా అమలు చేస్తూ నిధుల పర్యవేక్షణ చేయాలన్నారు. వికలాంగుల న్యాయమైన కోరికలు నెరవేరుస్తూ ప్రభుత్వ పథకాలు నేరుగా దివ్యాంగులకు అందేలా చూడాలన్నారు. ఎన్‌పీఆర్‌డీ మండల అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శి కుర్మయ్య తదితరులు ఉన్నారు.

'డాక్టర్ మల్లురవికే ఎంపీ టికెట్ కేటాయించాలి'

తిమ్మాజిపేట, మార్చి 10 : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందించిన సేవలను అధిష్టానం గుర్తించి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి డాక్టర్ మల్లురవికి ఎంపీ టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ బహదూర్ అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి విలేకర్లతో ఆదివారం మాట్లాడారు. మల్లురవికి మద్దతుగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని బీఆర్ఎస్, బీజేపీలను చిత్తుగా ఓడిస్తామన్నారు. అలుపెరుగని మచ్చలేని నాయకున్ని గెలిపించుకోవడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మాధవులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణలు ఉన్నారు.

మెపా స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా మధుసూదన్



బిజినేపల్లి, మార్చి 10 : ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) తెలంగాణ స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా కొంకలి మధుసూదన్ ముదిరాజ్‌ను రాష్ట్ర మెపా అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ నియామకం చేశారు. మండలంలోని పాలెం గ్రామానికి చెందిన మెపా స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా నియామక పత్రం అందుకున్న కొంకలి మధుసూదన్ ఆదివారం మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయిలో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడికి, ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో 60 లక్షలకు పైగా ముదిరాజ్‌ల జనాభా ఉన్న రిజర్వేషన్ ప్రక్రియలో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లను వెంటనే బీసీడీ నుంచి బీసీఏకు మార్చితే కొంతైన న్యాయం దక్కుతుందన్నారు. రాష్ట్రంలో వచ్చే నెలలో చేపట్టబోయే కులగణనలో ముదిరాజ్‌ల జనాభా ఆధారంగా రాజకీయ, సామాజిక రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌ల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటుచేసి నిధులు కేటాయించాలని కోరారు.

ఘనంగా మల్లెలమ్మ బ్రహ్మోత్సవాలు



మల్లెలమ్మకు పూజలు నిర్వహిస్తున్న మేదర సంఘం సభ్యులు

తెలకపల్లి, మార్చి 10 : మండల కేంద్రంలో వెలసిన మేదరుల ఆరాధ్య దైవం మల్లెలమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైనట్లు మేదరుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి ప్యారసాని రామకృష్ణ తెలిపారు. 19వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, బోనాలు, వడి బియ్యం పూజా కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మల్లెలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలతోపాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి ప్యారాసాని రామకృష్ణ, మండల సంఘం సభ్యులు నారాయణ, బాలస్వామి, బాలరాజు, మహిళా సంఘం సభ్యులు జిల్లా మేదర సంఘం సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రోడ్డు విస్తరణ పనులు

- కంకర పరిచారు.. వదిలేశారు
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- కరువైన ప్రమాద సూచికలు
- ఎగిసిపడుతున్న కంకర రాళ్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



తిమ్మాజిపేటలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్డు విస్తరణ పనులు

తిమ్మాజిపేట, మార్చి 10 : తిమ్మాజిపేట మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్సీ కాలనీ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ డివైడర్ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా ఐదు కోట్లు నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మంజూరు చేయించి రోడ్డు పనులు ప్రారంభించారు. శరవేగంగా ప్రారంభమైన రోడ్డు డివైడర్ పనులు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆగిపోవడంపై ప్రజలు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. డివైడర్‌లో మాత్రం విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. కూడలి విస్తరణ డ్రైనేజీ అదేవిధంగా పాదచారులు నడిచేందుకు వీలుగా చేసే పనులు ప్రారంభించకుండానే ఆగిపోయాయి. చేసిన పనులకు నిధులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారని అంటున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా తవ్వకాలు జరిపి కంకర పరిచి వదిలేయడంతో దుమ్ము విపరీతంగా వస్తున్నది. అదేవిధంగా ఉబ్బసం వంటి పలు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంకర రోడ్డుపై వాహనాలు వెళ్తున్నప్పుడు కంకర రాళ్లు ఎగిసిపడి ఎక్కడ ఎవరికి తగులుతాయోనని భయంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనుల కారణంగా వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. నిత్యం రద్దీగా ఉండే రహదారి వేలాదిగా వాహనాలు ఈ రోడ్డుపై వస్తూ పోతుంటాయి. పరిచిన కంకరలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కిందపడే ప్రమాదం ఉంటుందన్నారు. అధికంగా వస్తున్న దుమ్ము ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించడం లేదని డివైడర్ ప్రమాద సూచికలు కరువయ్యాయని అధికారుల నిర్లక్ష్యం వీడాలని ముందు గానే ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని రోడ్డు డివైడర్ విస్తరణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కన నిలిచిన వాహనాలు

కంకరపై వెంటనే రోడ్డు వేయాలి



పరిచిన కంకరపై వెంటనే రోడ్డు వేసి దుమ్ము బారి నుంచి మమ్మల్ని కాపాడాలి. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అసంపూర్తిగా మిగిలిన రోడ్డు డివైడర్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి వాహనదారుల, ప్రజల ఇబ్బందులు దూరం చేయాలి.

- మల్లేష్‌యాదవ్

గుత్తేదారులతో మాట్లాడి త్వరగా ప్రారంభిస్తాం

రోడ్డు విస్తరణ డివైడర్ పనులు నిధుల కొరత కారణంగా ఆపివేయడం జరిగింది. గుత్తేదారులతో మాట్లాడి త్వరగా ప్రారంభించేలా చూస్తాం. ఇదే విషయమై వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విస్తరణ పనులు వెంటనే పూర్తి చేస్తాం. - రజని ఆర్అండ్‌బీ డీఈ

ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట, మార్చి 10: ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పీఆర్‌సీ సమస్యలు పరిష్కారంలో భాగంగా ఆర్టీసీ కార్మికులకు 21 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడంతో పాటు పెంచిన వేతనాలు జూన్ 1నుంచి అమలులోకి తీసుకురావడం పట్ల ఆర్టీసీ కార్మికులు ఎంతో ఆనందంగా ఉన్నారని అన్నారు. త్వరలో ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అన్ని సమస్యలు పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక తీపి కబురు ఆర్టీసీ కార్మికులకు చెప్పబోతున్నారని పేర్కొన్నారు. అచ్చంపేట డిపోకు 30బస్సులు కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కోరానన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు ఆయనకు పూలుచల్లుతూ ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

● దేవతల ఆశీర్వాదం తీసుకున్న మల్లురవి

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు అవకాశం వచ్చి భారీ మోజార్టీతో గెలుపొందాలని ఏఐసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి ఆదివారం ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి నియోజకవర్గంలోని ఆలయాలు, దర్గాలు, చర్చిలను సందర్శించి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. డిండి కట్ట మైసమ్మను దర్శించుకున్నారు. అక్కడి నుంచి హాజీపూర్ ఆంజనేయ స్వామిని దర్శించుకొని ఉమామహేశ్వరంలో ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం రంగాపూర్ నిరంజన్ షావలీ దర్గా వద్ద ప్రార్థనలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాయకులు రాజేందర్, గోపాల్ రెడ్డి, రఘు, చత్రునాయక్, మల్లిఖార్జున్, శ్రీనివాసులు, సిద్దిక్, లోక్యానాయక్ పాల్గొన్నారు.

సిర్సనగండ్ల దేవాలయ అభివృద్ధికి కృషి

చారకొండ: రాష్ట్రంలో రెండో అపర బద్రాద్రిగా పేరు గాంచిన మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్ర స్వామి దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం డాక్టర్ మల్లురవి, జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సీతారామచంద్రస్వామిని వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఈవో మల్లెల రఘు ఆధ్వర్యంలో అర్చకులు డేరం లక్ష్మణశర్మ, డేరం మురళీధర్‌శర్మ, డేరం సీతారామశర్మ, డేరం కోదండరామశర్మలు ఎమ్మెల్యే వంశీకృష్ణ, డార్టర్ మల్లురవి, జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణంలోని భక్తుల సౌకర్యార్థం కోసం వాహనాల పార్కింగ్, తాగునీటికి, మరుగుదొడ్లకు ప్రభుత్వం రూ. 50 లక్షలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఈ ప్రాంత బిడ్డ అయిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సహకారంతో అచ్చంపేట ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. అనంతరం గుట్టపైన జరుగుతున్న అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, చారకొండ ఎంపీటీసీ-2 గ్యార లక్ష్మణ్, సింగిల్‌విండో డైరక్టర్ జగన్‌మోహన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు పానుగంటి అంజయ్య, అనిశెట్టి నాగేంద్ర, మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్‌గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు ముత్యాలమ్మ, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు, జిల్లా అధికార ప్రతినిధి బి. వీరస్వామి, మాజీ జట్పీటీసీ సభ్యుడు భీముడు నాయక్, జేసీబీ వెంకటయ్యగౌడ్, తక్కెళ్లపల్లి శేఖర్, శ్రీపతిరావు, దుర్గారెడ్డి, సందీప్‌రెడ్డి, నర్సింహరెడ్డి, మాధవరెడ్డి, కొండలయ్యగౌడ్, లక్ష్మయ్యగౌడ్, భరత్, నర్సింహచారి, తిరుమలేష్, విజయ్, వెంకట్రాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఉమామహేశ్వరుడ్ని దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఏఐసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి

దైవచింతనతో మానసిక ప్రశాంతత

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, మార్చి 10 : దైవచింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రతీ ఒక్కరు దైవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. కల్వకుర్తి పట్టణంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శ్రీమహాలక్ష్మీ యాగం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ హాజరై పూజలు నిర్వహించారు. మహాలక్ష్మీ యాగం, 108 హోమగుండాలతో జరిగిన యాగంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ హితం కోసం నిర్వహిస్తున్న యాగాలు, యజ్ఞాలు సత్ఫలితాలనిస్తాయని పేర్కొన్నారు. మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే భావనతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జూలూరి రమేష్‌బాబు దంపతులు, పలువురు నాయకులు ఉన్నారు.



కల్వకుర్తిలో మహాలక్ష్మీ యాగంలో పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

కందనూలు, మార్చి 10 : సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు కృషి చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర కేవీపీఎస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే 127వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతటి కాశన్న మాట్లాడారు. సావిత్రిబాయి పూలే తుది శ్వాస విడిచే సమయంలో ప్లేగు వ్యాధి సోకిన వారికి వైద్య సేవలందిస్తూ అదే వ్యాధి ఆమెకు సోకి మరణించారని ఆయన తెలిపారు. పేదలకు సామాజిక సేవ చేయడం పేదల జీవితాల్లో మమేకం కావడం ఆమె ప్రత్యేకత అని ఆయన కొనియాడారు. కేవీపీఎస్ నాయకులు కుంకేశ్వరం ప్రణయ్, రాఘవ, నరసింహ, కృష్ణయ్య, చంద్రయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

● కొల్లాపూర్: సావిత్రిబాయి పూలే వర్ధంతిని కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కొల్లాపూర్ మండల కేంద్రంలో సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ నాయకులు సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ మండల కార్యదర్శి బత్తిని రాజు మాట్లాడారు. బీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివవర్మ, కేవీపీఎస్ నాయకులు జయవర్ధన్, జ్ఞానేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

● వెల్దండ: సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఆదివారం మండలకేంద్రంలో ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీల నాయకులు సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు యెన్నం భూపతిరెడ్డి, ముదిరాజ్‌సంఘం అధ్యక్షుడు మల్లయ్య, నూకం వెంకటయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్, కాసారపు వెంకటయ్య, మోతీలాల్, యాఖూబ్, లింగం, ఎర్రశ్రీను, దేవేందర్, బాలకృష్ణ, శేఖర్, రమేష్, మల్లయ్య తదితరులు ఉన్నారు.



సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న

● కోడేరు: అణగారిన వర్గాల అభివృద్ధి కోసం అహర్నిషలు ఆరాటపడిన వీరనారి సావిత్రిబాయి పూలే అని జిల్లా బీఎస్‌జేఏసీ ఉపాధ్యక్షుడు ఆదిసోమనాథ్ అన్నారు. ఆదివారం కోడేరు మండల కేంద్రంతోపాటు నర్సాయిపల్లి, బాడుగదిన్నె తదితర గ్రామాల్లో ఆమె వర్ధంతిని నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో మల్లికార్జునస్వామి కల్యాణం



పాపగల్‌లో మల్లికార్జునస్వామి దేవాలయానికి వెళ్తున్న ఎద్దుల బండ్లు

తాడూరు, మార్చి 10 : మండలంలోని పాపగల్ గ్రామంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ సమీపంలో ఉన్న మల్లికార్జునస్వామి దేవాలయంలో ఒకరోజు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అందులో భాగంగానే ఆదివారం మల్లికార్జున స్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించి ఆలయం చుట్టు ట్రాక్టర్లతో ప్రదక్షిణలు నిర్వహించారు. మొత్తంగా మల్లికార్జునస్వామి ప్రత్యేక పూజలు ఘనంగా కొనసాగాయి. పాపగల్ గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాలైన నేరేళ్లపల్లి, బావాజీపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

కందనూలు, మార్చి 10 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండ గీత మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు పురోగతి సాధిస్తున్నారని, విద్య, వైద్య రంగాల్లో ఎనలేని ప్రగతి సాధిస్తూ దేశంలోకెల్లా మహిళల పాత్ర అత్యంత భూమిక పోషిస్తుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆమె పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి వర్ధం పర్వతాలు, రామయ్య, గుంపల్లి అశోక్, జయశ్రీ, భాగ్య, అమీనా, కృష్ణవేణి, వెంకటమ్మ, అలివేల తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయ క్రీడలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

కల్వకుర్తి, మార్చి 10 : కల్వకుర్తి పట్టణంలో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉపాధ్యాయ క్రీడలు ఆదివారం ముగిశాయి. క్రీడల్లో కల్వకుర్తి పూర్వపు తాలుకా పరిధిలో 9మండలాల నుంచి 300మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. క్రికెట్‌లో విజేతగా వంగూరు మండలం నిలువగా, రన్నర్‌గా వెల్దండ మండలం నిలిచింది. అదేవిధంగా వివిధ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు క్లాస్‌మేట్ నాయకులు బహుమతులు ప్రదానం చేశారు. క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్, క్లాస్‌మేట్ క్లబ్ నాయకులు కలిమిచెర్ల రమేష్, లక్ష్మీ, నరసింహారావు, శోభన్‌బాబు, రాజేందర్, రాజు, రఘురాం, శశాంక్, సాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

నాగర్‌కర్నూల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం మార్చి 11న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ప్రజల సమస్యల పరిష్కారానికై నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసిన విషయాన్ని గమనించి జిల్లా ప్రజలు వ్యయాప్రయాసాలకోర్చి నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌కు రావద్దని జిల్లాలో ఎన్నికల కార్యక్రమం కొనసాగుతుందని అప్పటి వరకు విషయాన్ని గమనించగలరని కలెక్టర్ ప్రకటనలో కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

వంగూరు, మార్చి 10: ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్‌జీటీయూ సంఘం ముందుండి ప్రభుత్వంపై పోరాడుతుందని ఎస్‌జీటీయూ సంఘం జిల్లా బాధ్యులు రాజేందర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగ విద్యను మరింత పటిష్టం చేయాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఎస్‌జీటీయూ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు అందరు పాల్గొని సభ్యత్వం తీసుకోవాలన్నారు.

దుర్గాదేవి ఆలయంలో అభిషేక కార్యక్రమం

తెలకపల్లి, మార్చి 10 : మండల కేంద్రంలోని త్రిముఖ దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో మాఘ అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం ఆలయ అర్చకులు మారోజు ఉమాపతి ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అష్టోత్తరం, కుంకుమార్చన, హోమాలు నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు ఉమాపతి ఆచార్యులు అమ్మవారి విశిష్టతను తెలిపి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఫిల్టర్ వాటర్ పునరుద్ధరణ

కోడేరు, మార్చి 10 : కోడేరు మండల కేంద్రంలో ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం మండల పరిషత్ కో ఆప్షన్ మెంబరు ప్రారంభించారు. గతంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఫిల్టర్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయగా గ్రామ పంచాయతీ పట్టించుకోకపోవడంతో అర్థాంతరంగా నిలిచిపోయింది. ప్రస్తుతం స్థానిక కాంగ్రెస్ నాయకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వాటర్ ప్లాంట్‌ను పునఃప్రారంభించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రంగినేని జగదీశ్వర్‌రావు, ఎరుకలి మల్లయ్య, యాపట్ల నిరంజన్, దూరెడ్డి సురేందర్‌రెడ్డి, మిద్దె రామకృష్ణ, ఆదిరాజు, చామంతిరాజు, వీరస్వామి, గుట్టమాల రవీందర్, మహేష్, పుట్ట రాముడు, ఎండి.నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చేయూత

కల్వకుర్తి, మార్చి 10 : పేదలకు సొంతింటి కల సాకారం చేయించేందుకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చేయూతగా నిలుస్తోంది. ట్రస్టు చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ నియోజకవర్గంలోని ఎంతోమంది పేదలకు ఇళ్ల నిర్మాణాలకు సిమెంట్, ఇసుక, స్టీల్, కంకర అందిస్తూ తోడుగా ఉంటున్నారు. కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన కృష్ణయ్య ఇంటి స్లాబ్ నిర్మాణానికి సిమెంట్, సీకులను ఉప్పల వెంకటేశ్ ఆదివారం సమకూర్చారు. దీంతో బాధితుడు కృష్ణయ్య తన ఇంటి నిర్మాణానికి సిమెంట్, స్టీల్ ఉచితంగా సరఫరా చేసిన ఉప్పల వెంకటేశ్‌కు కృష్ణయ్య ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు గణేష్, కిశోర్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఉప్పునుంతల, మార్చి 10 : మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు పనులకు ఎంపిటీసీ సభ్యురాలు రామలక్ష్మమ్మ ప్రారంభించారు. బీఆర్ఎస్ మండల నాయకులు నర్సింహరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రాజాలరామ్, గణేష్ తదితరులు ఉన్నారు.

'పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

కొల్లాపూర్, మార్చి 10 : ఇటీవలే తాజా మాజీలుగా మారిన గ్రామాల సర్పంచ్‌లకు ప్రభుత్వాలు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు పోతుగంటి బాలకృష్ణుడు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికై సొంత నిధులు వెచ్చించి పని చేసిన తాజా, మాజీ సర్పంచ్‌లకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా తాత్సారం చేయడం తగదన్నారు.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

కొల్లాపూర్, మార్చి 10 : సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని సింగిల్ విండో డైరెక్టర్ పుస్పుల నరసింహ అన్నారు. టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగుల శ్రమను గుర్తిస్తూ పీఆర్సీని ప్రకటించడం పట్ల ఆయన ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగుల శ్రమకు తగిన గుర్తింపుగా 21శాతం ఫిట్‌మెంట్‌తో 53,071మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరేలా కాంగ్రెస్ ప్రభుత్వం పీఆర్సీ నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతిలో ఆర్టీసీ పాత్రను గుర్తించి వేతన సవరణకు అనుమతించారన్నారు.

లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు

ఉప్పునుంతల, మార్చి 10 : మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలోని ప్రసిద్ధి గాంచిన లక్ష్మీనర్సింహస్వామిని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మండల నాయకులు నర్సింహ్మారెడ్డి, రాజాల్‌రావు కట్టా అనంతారెడ్డి, గణేష్, రాజేందర్, మొగులాల్ తదితరులు ఉన్నారు.